క్లుప్తంగా

క్లాత్ బ్యాగులే మేలు



గుడ్డ సంచిలోకి కూరగాయలను మారుస్తున్న ఈవో కొండబాబు

సీతమ్మధార: ప్లాస్టిక్, పాలిథిన్‌కు బదులుగా గుడ్డ సంచుల వినియోగమే మంచిదని సీతమ్మధార రైతుబజార్ ఎస్టేట్ ఆఫీసర్ కొండబాబు అన్నారు. రైతుబజార్‌లో శుక్రవారం ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కొంతమంది వినియోగదారులు ప్లాస్టిక్ కవర్లు వాడటంతో అవగాహన కల్పించామని ఈవో తెలిపారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల వచ్చే నష్టాలను వినియోగదారులకు వివరించారు. కూరగాయలను క్లాత్ బ్యాగుల్లో తీసుకెళ్లాలని సూచించారు. సహాయకుడు సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాల వేలం నేడు

మద్రిపాలెం: స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(సెబ్) మురళీనగర్ వద్ద ఉన్న గోపాలపట్నం సర్కిల్-4లో ఈ నెల 4న ద్విచక్ర వాహనాల వేలం వేయనున్నట్టు సెబ్ సీఐ సీహెచ్‌వీఎస్ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. మురళీనగర్ ఎస్ఆర్ ఫంక్షన్ హాల్ సమీపంలోని సెబ్ స్టేషన్‌లో ఉదయం 11 గంటలకు వివిధ ఎక్సైజ్ నేరాల్లో పట్టుబడిన వాహనాల వేలంపాట ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు పాల్గొనవచ్చని ఆయన కోరారు.

అలరించిన కర్ణాటక గాత్ర కచేరీ



కీర్తనలు ఆలపిస్తున్న గాయకుడు అనుజ్

సీతంపేట: లలితానగర్ లలితా పీఠంలో శుక్రవారం కర్ణాటక గాత్ర కచేరీ నిర్వహించారు. వి.గౌరీ రామమోహన్ శిష్యుడు అనుజ్ తన అద్భుత గాత్రంతో త్యాగరాజ, జయదేవ, తులసీదాస్ కృతులు, కీర్తనలు ఆలపించి అలరించాడు. శ్రీవిష్ణురాజ, నాద తనుమనిషం, సరస్వతీ నమోస్తుతే, దుర్గాదేవి, జయ జయ వైష్ణవి, నాథ హరే, జయ జగత్ జనని కీర్తనలు భక్తులను సమ్మోహనపర్చాయి. ఎస్.కృష్ణప్రియ వయోలిన్‌పై, టి.సాయిచంద్రశేఖర్ మృదంగంపై వాద్య సహకారం అందించారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ గాయకుడు అనుజ్‌ను అభినందించారు.

డాక్టర్ వరప్రసాద్‌కు ఎన్టీఆర్ పురస్కారం



కంచరపాలెం: డాక్టర్ నందమూరి తారక రామారావు శత జయంతిని పురస్కరించుకుని ఎన్టీఆర్ జాతీయ జీవన సాఫల్య పురస్కారాన్ని కంచరపాలేనికి చెందిన డాక్టర్ మాముడూరి వరప్రసాద్ అందుకున్నారు. సామాజిక, కళా, రాజకీయ రంగాల్లో ఉత్తమ సేవలకు గానూ ఈ అవార్డు పొందినట్లు ఆయన తెలిపారు. ఈ పురస్కారంతో తనపై సామాజిక బాధ్యత మరింత పెరిగిందన్నారు. తన సేవలకు గుర్తింపుగా అవార్డు రావడానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికీ డాక్టర్ వరప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు.

ఉచిత మెగా వైద్య శిబిరం రేపు

డాబాగార్డెన్స్: విశాఖపట్నం స్మార్ట్‌సిటీ లయన్స్ క్లబ్, విశాఖ సంగీత కళాకారుల సంక్షేమ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 5న ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు క్లబ్ ప్రెసిడెంట్ ఎం త్రినాథరావు, కార్యదర్శి వి.వల్లీకుమారి, విశాఖ సంగీత కళాకారుల సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడు కొణతాల రాజు, అధ్యక్షుడు మహ్మద్‌ఖాన్, చెన్నా తిరుమలరావు తెలిపారు. ఉదయం 8.30 గంటల నుంచి డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రం వేదికగా నిర్వహించనున్న వైద్య శిబిరంలో షుగర్, బీపీ, దంత పరీక్షలు, కంటి పరీక్షలు నిర్వహిస్తామన్నారు. జనరల్ ఫిజీషియన్ వైద్యులచే ఈ ఉచిత వైద్య శిబిరం, క్యాన్సర్‌పై అవగాహన సదస్సు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. మరిన్ని వివరాలకు 9395111133 నంబరులో సంప్రదించాలని తెలిపారు.

జనం కోసం

అందుబాటులో ఆధార్ సేవలు

- జోన్-3లో 10 కేంద్రాల ఏర్పాటు
- బయోమెట్రిక్, చిరునామా వివరాల అప్‌డేషన్‌కు అవకాశం



దొండపర్తి 143 సచివాలయంలో ఆధార్ అప్‌డేట్ చేస్తున్న కార్యదర్శి

సీతంపేట: ఆధార్ కార్డు తీసుకుని పదేళ్లు దాటిన వారు బయోమెట్రిక్, చిరునామా వివరాలను అప్‌డేట్ చేసుకోవాలని ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. దీంతో ఆధార్ నమోదు కేంద్రాల సమాచారం తెలియక చాలా మంది ఇబ్బంది పడుతున్నారు. జీవీఎంసీ జోన్-3 పరిధిలోని 10 వార్డు సచివాలయాల్లో ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఎంపిక చేసిన సచివాలయంలో ఆధార్ అప్‌డేట్ సేవలు పొందవచ్చు. దొండపర్తి నెహ్రూ బజార్ రోడ్డులోని 143 సచివాలయంలో ఏర్పాటు చేసిన శాశ్వత ఆధార్ కేంద్రంలో ఎప్పుడైనా బయోమెట్రిక్ అప్‌డేట్ చేసుకోవచ్చు.

జీవీఎంసీ జోన్-3 పరిధిలో ఆధార్ కేంద్రాల వివరాలు

సంఖ్య	సచివాలయం కోడ్	సచివాలయం పేరు	సెక్రటరీ పేరు	ఫోన్ నంబర్
1.	1086117	మద్దిలపాలెం-03	బోయిన నాగేశ్వరరావు	95422 66611
2.	1086110	రజక వీధి-01	ఉప్పాడ ఆదిసోంబాబు	94940 82506
3.	1086163	రెల్లిపేట కాలనీ	పిడింట్ల సాయికుమార్	70134 26964
4.	1086125	లలితానగర్	గేది యమున	74164 90464
5.	1086154	ఇందిరానగర్-03	దన్నిన అనిల్‌కుమార్	97039 50500
6.	1086106	న్యూవెంకోజీపాలెం-02	శిరిషా యలమంచిలి	99663 42176
7.	1086150	బాలాజీనగర్-04	గొలగాని రాఘవేంద్ర	70369 33013
8.	1086143	దొండపర్తి-02	గౌరి పైలా	83176 04549
9.	1086138	పాత రేసపువానిపాలెం	డెక్కల లోవరాజు	91334 19363
10.	1086149	పిఠాపురం కాలనీ	పెద్దింటి హరిత	99488 85933

సామాన్యులపై గ్యాస్ ధరల భారం



నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు, ఆటో డ్రైవర్లు

సీతంపేట: కేంద్ర ప్రభుత్వం పెంచిన వంట గ్యాస్ సిలిండర్ ధరలను వెంటనే రద్దు చేయాలని సీపీఐ నాయకుడు జి.వామనమూర్తి డిమాండ్ చేశారు. సీపీఐ ఆధ్వర్యంలో శుక్రవారం అక్కయ్యపాలెం 80 ఫీట్ రోడ్డులో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వస్తే వంద రోజుల్లో పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గిస్తామని హామీ ఇచ్చిందని, ఏడున్నరేళ్లు దాటినా ఆ ఊసెత్తకుండా ప్రధాని మోదీ ప్రజలను మోసం చేశారన్నారు. ఇంధన, నిత్యావసర సరకుల ధరలు పెంచి పేద, మధ్య తరగతి ప్రజలపై ఆర్థిక భారాలు వేస్తూ, గుజరాత్ రాష్ట్రానికి చెందిన మోదీ గ్రూప్‌నకు రూ.10 లక్షల కోట్ల రూపాయల రాయితీలు కల్పించారని విమర్శించారు. పెంచిన గ్యాస్ ధరలకు వ్యతిరేకంగా ప్రజలు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఆటో డ్రైవర్లు, ముఠా కలాసీలు, భవన నిర్మాణ కార్మికులు గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలని నినాదాలు చేశారు. సీపీఐ నాయకులు అబ్దుల్ రజాక్, కాండ్రేగుల రాము, బి.రాము, పి.సాయి, ఎ.కృష్ణ, పి.ప్రసాద్, సూరిబాబు, పి.జయలక్ష్మి, రణబీర్ సింగ్ పాల్గొన్నారు.

పైడిమాంబ దర్శనానికి పోటెత్తిన భక్తులు



పైడిమాంబకు పూజలు చేస్తున్న భక్తులు



అమ్మవారి దర్శనం కోసం వేచి ఉన్న భక్తులు

ఆరిలోవ: జాతీయ రహదారిని ఆనుకుని డెయిరీ ఫారం వద్ద 14 గ్రామాల ఇలవేల్పు పైడిమాంబ జాతర మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఇందిరానగర్, డెయిరీఫారం, ఆదర్శనగర్, ఎస్‌ఐజీ నగర్, రవీంద్రనగర్ తదితర ప్రాంతాల నుంచి భక్తులు పోటెత్తారు. అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. ఈ నెల 7న జరగనున్న అమ్మవారి జాతర కోసం ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు.

సమాచారమ్

పారిశుధ్య సమస్యా.. ఫోన్ చేయండి



48వ వార్డులో సిబ్బందితో కలిసి కాలువను శుభ్రం చేస్తున్న జెడ్సీ కృష్ణ(ఫైల్)

కంచరపాలెం: జీవీఎంసీ జోన్-5 పరిధిలో ప్రజా ఆరోగ్యం, పారిశుధ్య సమస్యలపై సంబంధిత అధికారుల ఫోన్ నంబర్లకు కాల్ చేసి తెలియజేయవచ్చు. ఉత్తర నియోజకవర్గంలోని 42వ వార్డు నుంచి 51, 53, 54, 55 వార్డుల వరకు గల 13 వార్డులకు సంబంధించి రహదారుల శుభ్రత, చెత్త సేకరణ-తొలగింపు, గెడ్డలు, కాలువల్లో పూడిక తీత మొదలగు పనుల విషయంలో పారిశుధ్య సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే.. ఆయా వార్డుల శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, హెల్త్ అసిస్టెంట్లకు ఫోన్ చేసి సమాచారం అందించవచ్చు. వారు స్పందించని పక్షంలో జ్ఞానాపురంలోని జోన్-5 కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమంలో ఫిర్యాదులు చేయవచ్చని పబ్లిక్ హెల్త్ ఏఎంహెచ్‌వో డాక్టర్ రాజేష్, సూపర్‌వైజర్ ఎస్.జనార్దన్‌లు తెలిపారు.

వార్డు నం.	అధికారి పేరు	బాధ్యత	ఫోన్ నంబర్
జోన్-5	డాక్టర్ రాజేష్	ఏఎంహెచ్‌వో(పబ్లిక్ హెల్త్)	99480 95520
జోన్-5	ఎస్.జనార్దన్	సూపర్‌వైజర్(పబ్లిక్ హెల్త్)	99121 99283
42	ఎం.సన్యాసిదొర	హెల్త్ అసిస్టెంట్	99488 83942
43	అప్పలరాజు	శానిటరీ ఇన్‌స్పెక్టర్	99665 91821
44	ఎన్.సూరిబాబు	శానిటరీ ఇన్‌స్పెక్టర్	99488 83932
45	కె.పాండురంగా	హెల్త్ అసిస్టెంట్	99488 83913
46	వి.సత్యం	శానిటరీ ఇన్‌స్పెక్టర్	99488 83970
47	కె.వి.రమణమూర్తి	శానిటరీ ఇన్‌స్పెక్టర్	99488 83937
49	ఎం.రామకృష్ణ	శానిటరీ ఇన్‌స్పెక్టర్	99488 83943
50	బి.సుధాకర్	శానిటరీ ఇన్‌స్పెక్టర్	94941 83244
51	ఎ.కృష్ణ	శానిటరీ ఇన్‌స్పెక్టర్	99488 83949
53	పి.టి.తులసీ	సచివాలయ కార్యదర్శి	99490 98777
54	వై.త్రిమూర్తులు	పబ్లిక్ హెల్త్ మేస్త్రీ	99488 83947
55	యు.కార్తీక్	హెల్త్ అసిస్టెంట్	91105 97632

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార హోరు



గాయత్రినగర్‌లో ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్



53వ వార్డులో కరపత్రాలు అందిస్తున్న కార్పొరేటర్ బర్కత్ అలీ

సీతంపేట: వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు ఆదేశాల మేరకు సీతంరాజు సుధాకర్‌కు మద్దతుగా ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది. 25వ వార్డులోని 134 సచివాలయం పరిధి గాయత్రినగర్‌లో శుక్రవారం జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్, కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పట్టభద్రుల ఇళ్లకు వెళ్లి వైఎస్సార్‌సీపీ బలపర్చిన ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరుతూ కరపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సారిపిల్లి సంతోష్, భోగవిల్లి గోవింద్, పోతిబంతి హరి, ఉప్పాడ సన్నీ, గుడివాడ గౌరినాయుడు, వానపల్లి లక్ష్మణ్‌బాబు, జయ, గోవిందమ్మ సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

51వ వార్డులో..

మద్రిపాలెం: జీవీఎంసీ 51వ వార్డులోని 290 సచివాలయం పరిధి చిట్టిబాబు కాలనీ, గాంధీనగర్, అప్పయ్యనగర్, గోల్డ్‌స్మిత్ కాలనీ, మహత్ కాలనీ ప్రాంతాల్లో కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని పట్టభద్రులను కోరి కరపత్రాలను అందజేశారు. పార్టీ నాయకులు పాల్గొన్నారు.

53వ వార్డులో..

జీవీఎంసీ 53వ వార్డు 295, 297 సచివాలయాల పరిధిలోని శ్రీరామ్‌నగర్, శివనగర్ ప్రాంతాల్లో కార్పొరేటర్ బర్కత్ అలీ ఎన్నికల ప్రచారం చేశారు. సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని గ్రాడ్యుయేట్లను కోరారు.

వైభవుడికి నేడు సుప్రభాత సేవ



వైభవ వేంకటేశ్వర స్వామి

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ నిర్వహిస్తామని ఆలయ ఈవో బండారు ప్రసాద్ తెలిపారు. తెల్లవారుజామున సన్నిధి గొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపిస్తారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేస్తారు. ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్ఠి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన ఉంటుంది. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేస్తారు. సాయంత్రం 6.30 గంటలకు వైభవుడికి నక్షత్ర, కర్పూర, కూష్మాండ, కుంభ హారతులు సమర్పిస్తారు.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేకం



డాబాగార్డెన్స్: బురుజుపేట కనకమహాలక్ష్మి ఆలయంలో శుక్రవారం క్షీరాభిషేక సేవ ఘనంగా నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు జరిగిన ఈ సేవలో 20 మంది ఉభయదాతలు పాల్గొన్నారు. ప్రతి శుక్రవారం నిర్వహించే క్షీరాభిషేక సేవలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించాలని ఈవో కె.శిరీష తెలిపారు. భక్తులు 0891-2566514, 89855 15989 నంబర్లలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఏఈవో వెంపలి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

రక్షణగిరిలో ప్రత్యేక ప్రార్థనలు



శిలువ మార్గాన్ని చూపిస్తున్న ఫాదర్

కంచరపాలెం: క్రీస్తు నందు భయభక్తులు కలిగి జీవించాలని జ్ఞానాపురం పునీత పేతురు ప్రధాన దేవాలయం ఫాదర్ ఆనంద్ అన్నారు. పాస్కా కాలాన్ని పురస్కరించుకుని శుక్రవారం పునీత పేతురు దేవాలయం రెవరెండ్ ఫాదర్ జొన్నాడ ప్రకాష్ నేతృత్వంలో రక్షణగిరి పుణ్యక్షేత్రం వరకు ఘనంగా పరిశుద్ధ శిలువ మార్గం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫాదర్ ఆనంద్ మాట్లాడుతూ క్రీస్తునందు భయభక్తులు కలిగి ఉండటం ద్వారా ముక్తి లభిస్తుందన్నారు. అదే జ్ఞానానికి మూలమని పరిశుద్ధ బైబిల్ గ్రంథంలో పేర్కొని ఉందన్నారు.

మహిళా చైతన్యంపై వాకథాన్



వాకథాన్‌లో పాల్గొన్న విద్యార్థులు

కొమ్మాది: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని గీతంలో ముందుగానే పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మహిళా చైతన్యంపై శుక్రవారం వాకథాన్ చేశారు. గీతం మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాన్ని గీతం అధ్యక్షుడు ఎం.శ్రీభరత్ ప్రారంభించారు.

టెన్త్ విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సంతోష్

కంచరపాలెం: పదో తరగతి విద్యార్థులు నిపుణులను కలవడం, స్వల్ప, దీర్ఘకాలిక కోర్సులు అభ్యసించడం, వాస్తవ స్థితిగతులను తెలుసుకోవడం ద్వారానే కెరీర్ గైడెన్స్‌ను ఎంచుకోవచ్చని ఎడ్యుకేషన్ రిసోర్స్ పర్సన్ పుల్లేటికుర్తి సంతోష్ అన్నారు. చైల్డ్ రైట్స్ అండ్ యూ, ధరణి సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం రామ్మూర్తిపంతులుపేట జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. టెన్త్ తరువాత విభిన్న అవకాశాలు, సాంకేతిక అవకాశాలపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా విద్యార్థులకు ఆయన వివరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఆర్.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పెద్దాడ వెంకటేశ్వరరావు, ధరణి సంస్థ కార్యదర్శి బి.హరి పాల్గొన్నారు.

మహిళా రైతు నిజాయితీ

రైతుబజార్‌లో దొరికిన సెల్‌ఫోన్ అప్పగింత



వినియోగదారుడు గోపీకి సెల్‌ఫోన్‌ను అందిస్తున్న రైతు అచ్చియ్యమ్మ

సీతమ్మధార: సీతమ్మధార రైతుబజార్‌కు చెందిన ఓ మహిళా రైతు తనకు దొరికిన సెల్‌ఫోన్‌ను సంబంధిత వ్యక్తికి అందించి నిజాయితీని చాటుకున్నారు. వివరాలిలా.. డాబాగార్డెన్స్‌కు చెందిన గోపీ అనే వినియోగదారుడు శుక్రవారం సీతమ్మధార రైతుబజార్‌కు వచ్చాడు. రూ.15 వేల విలువ చేసే తన సెల్‌ఫోన్‌ను ఒక స్టాల్‌లో వదిలేసి వెళ్లిపోయాడు. అది గమనించిన రైతు వ్యాపారి అచ్చియ్యమ్మ మొబైల్ ఫోన్ రైతుబజార్ ఎస్టేట్ ఆఫీసర్ కొండబాబుకు అందజేశారు. వినియోగదారుడు గోపీకి సమాచారమిచ్చి పోగొట్టుకున్న ఫోన్‌ను ఆమె చేతుల మీదుగా ఈవో అప్పగించారు. అచ్చియ్యమ్మ నిజాయితీని మెచ్చుకుని పలువురు అభినందించారు.

వినికిడి సమస్యలున్న పిల్లలకు వైద్య సేవలు



మాట్లాడుతున్న కేజీహెచ్ సూపరింటెండెంట్ అశోక్‌కుమార్

మహారాణిపేట: వినికిడి సమస్యలున్న పిల్లలకు అవసరమైన వైద్య సేవలు కేజీహెచ్‌లో అందిస్తున్నామని సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్ తెలిపారు. ప్రపంచ వినికిడి దినోత్సవంలో భాగంగా జిల్లా రాష్ట్రీయ బాల స్వస్త కార్యక్రమం ఆధ్వర్యంలో శుక్రవారం కేజీహెచ్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్‌లో ఏడేళ్లలో 70 మంది పిల్లలకు కాక్లియర్ ఇంప్లాంటేషన్ సర్జరీలు జరిగాయన్నారు. 116 మంది పిల్లలకు హియరింగ్ ఎయిడ్స్ పరికరాలు అందించామని చెప్పారు. కేజీహెచ్ పిల్లల విభాగాధిపతి డాక్టర్ బి.చక్రవర్తి మాట్లాడుతూ స్పీచ్ థెరపీ ద్వారా ఎందరో పిల్లలు లబ్ధి పొందారని తెలిపారు. జిల్లా రాష్ట్రీయ బాల స్వస్త కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్ సమత మాట్లాడుతూ పుట్టుక నుంచి 18 ఏళ్ల లోపు పిల్లలకు పుట్టుకతో వచ్చే సమస్యలు, ఎదుగుదల లోపాలను గుర్తించి తగిన చికిత్స అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు, ఆడియాలజిస్ట్ కమ్ స్పీచ్ థెరపిస్ట్ పి.కృష్ణవేణి, సిబ్బంది పాల్గొన్నారు.

దినచర్యలో తత్వశాస్త్ర అధ్యయనం భాగం



ప్రొఫెసర్ రజనిని సత్కరిస్తున్న ఆచార్య నరసింహారావు

ఏయూ క్యాంపస్: తత్వశాస్త్ర అధ్యయనం మానవుడి దినచర్యలో భాగం కావాలని ఏయూ ఆర్ట్స్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు అన్నారు. ఏయూ తత్వశాస్త్ర విభాగంలో ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ ఫిలాసఫీ రీసెర్చ్ న్యూఢిల్లీ సహకారంతో 'భారతీయ సంస్కృతికి అరవిందుని దృక్పథం' అనే అంశంపై శుక్రవారం నిర్వహించిన ఉపన్యాస కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం నరసింహారావు మాట్లాడుతూ ధ్యానం ఒక సాధనంగా చేసుకుంటే మానవులు తమను తాము అర్థం చేసుకోవడం సాధ్యపడుతుందన్నారు. ప్రపంచంలో ఏ దేశానికి లేని తాత్విక సంపద భారత్‌కు ఉందన్నారు. దీనిని పొందడం కోసం ప్రపంచ దేశాలు భారతీయ సంస్కృతిపై ఆసక్తి చూపిస్తున్నాయని పేర్కొన్నారు. ప్రధాన ఉపన్యాసకురాలు, ఐసీపీఆర్ సీనియర్ ఫెలో రిటైర్డ్ ప్రొఫెసర్ ఆచార్యులు కె.ఆర్.రజిని మాట్లాడుతూ సమస్యలను అధిగమించడానికి పూర్ణ యోగాను ప్రజలంతా అలవాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తత్వశాస్త్ర విభాగాధిపతి ఆచార్య వానపల్లి వెంకటరావు, విశ్రాంత ఆచార్యులు ఎం.వి.కృష్ణయ్య, ఆచార్య రవిబాబు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రహదారుల పరిశుభ్రతకు ప్రాధాన్యం

జోన్-4 కమిషనర్ శివప్రసాద్

జగదాంబ: నగరంలో గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ జరుగుతున్న నేపథ్యంలో రహదారులన్నింటినీ పరిశుభ్రంగా ఉంచాలని జీవీఎంసీ జోన్-4 కమిషనర్ కె.శివప్రసాద్ ఆదేశించారు. జోన్ పరిధిలోని 12 వార్డుల్లో శుక్రవారం ఆయన పర్యటించి సిరిపురం, బీచ్ రోడ్డు మొదలగు ప్రధాన రహదారులను శుభ్రం చేయించారు. జెడ్సీ మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. యూజీడీలు పొంగకుండా చూసుకునే బాధ్యత వారిదేనన్నారు. ప్రజా మరుగుదొడ్లు శుభ్రంగా ఉండాలని సూచించారు. యూజీడీ మ్యాన్‌హోల్స్ పొంగి రహదారులపై ప్రవహించకుండా ముందుగానే మరమ్మతులు చేయించాలన్నారు. డివైడర్ల వద్ద మట్టి లేకుండా శుభ్రం చేయాలన్నారు. హార్టీకల్చర్ అధికారులు డివైడర్ల మధ్యలోని మొక్కల సంరక్షణపై బాధ్యతగా ఉండాలని చెప్పారు. పర్యటనలో జోన్ పబ్లిక్ హెల్త్ ఏఎంహెచ్‌వో ఎస్.కిశోర్, శానిటరీ సెక్రటరీలు పాల్గొన్నారు.

సింహగిరి.. ఆధ్యాత్మిక ఝరి



నిత్యకల్యాణంలో జీలకర్రబెల్లం ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: ఏకాదశిని పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి ఆలయానికి శుక్రవారం భక్తులు పోటెత్తారు. దీంతో కొండపై ఆధ్యాత్మిక భావం ఉప్పొంగింది. ఉదయం నుంచి విశేష పూజలు నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు స్వర్ణ తులసీదళార్చన నిర్వహించారు. స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను ఆలయ కల్యాణమండపంలోని వేదికపై అధిష్టంపజేసి 108 స్వర్ణ తులసీ దళాలతో స్వామికి అష్టోత్తరశతనామావళి పూజ చేశారు. అర్చకుడు అప్పాజీ తదితరులు పూజ నిర్వహించగా ఆలయ ఇన్‌స్పెక్టర్ సిరిపురపు కనకరాజు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

కమనీయం.. అప్పన్న కల్యాణం

వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు నిత్యకల్యాణం కమనీయంగా జరిగింది. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు.

బాలికల సంరక్షణపై అవగాహన ర్యాలీ

మహారాణిపేట: భేటీ బచావో-భేటీ పడావో కార్యక్రమంలో భాగంగా వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. మహారాణిపేట వద్ద మొదలైన ఈ ర్యాలీ జబ్బర్‌తోట పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వరకు జరిగింది. ఈ నెల 1న మొదలై 8వ తేదీ వరకు జరగనున్న కార్యక్రమంలో భాగంగా ర్యాలీ చేశారు. లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరమనే అంశంపై స్థానికులకు అవగాహన కలిగించారు. కార్యక్రమంలో జిల్లా వ్యాధి నిరోధక శాఖాధికారి డాక్టర్ ఎస్.జీవన్‌రాణి, జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ పూర్ణేంద్రబాబు, జిల్లా రాష్ట్రీయ బాల స్వస్త కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్ సమత, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.